# సంపాదకీయము

పూజ్య గురుదేవులు శ్రీ బాబూజీ మహారాజ్ వారి 109వ జన్మదినోత్సవ శుభదినమున వారి స్మరణలోనే గడుపు సదవకాశము మనకు మరొకమారు కలుగుట మన భాగ్యము.

సృష్టిలోని ప్రాణులన్నిటిలోను మానవజన్మ ఉన్నతమైనది. అన్ని ప్రాణులకు జీవనావసరములు ఒకేవిధముగా ప్రకృతి కల్పించినది కానీ మానవునికే ప్రత్యేకముగా సంకల్పశక్తి మరియు తన ప్రేరణలను నియంత్రించుకొను శక్తిని ప్రసాదించినది. వీటిని సరియైన రీతిలో వినియోగించి తన భావనా రీతిలో మార్పుచేసుకొనగలిగిన వాని జీవితము అర్థవంతమగును. నిజమైన మానవునిగా మార్పుచెందుటయే మన లక్ష్యము కావలెను. దానికి సత్యపథమార్గమును గురుదేవులు ఆదేశించిన పద్ధతిలో క్రమశిక్షణతో అనుసరించవలెను.

వివిధమైన మతతత్వములుగల పవిత్ర భారతదేశములో మనము జన్మించినాము. సత్‌తత్వము పొందవలెనను ఆశయమున్నను అది సామాన్య గృహస్థునకు పొందు అవకాశము లేనిదిగా చెప్పబడుటవలన నిరుత్సాహముతో చాలామంది దానికి దూరముగా నుండిరి. ఇటువంటి భావనలను మనలో పెంపొందించుకొనుటవలన మన సదాశయములో సహాయపడు ఏకైక సాధనమైన సంకల్పశక్తి బలహీనమైపోవును. అందువలన అటువంటి ఆలోచనలను తొలగించుకొనవలెను. మనకై మనము సృష్టించుకొన్న అల్ప పరిమితులనుండి బయటపడి ఉన్నత చైతన్యస్థితులకు ఎదిగినపుడే దైవకార్యములో పాలుపంచుకొను అవకాశము మనకు లభించును. దీనికి దృఢమైన సంకల్పమున్నను దానికి తోడుగా గురుదేవులు మనకు దయతో ప్రసాదించిన సాధనాపద్ధతులను పాటించుటయే గాక ప్రాణాహుతి సహకారమును శిక్షకులనుండి పొంది దివ్య చైతన్య స్థితులకు ఎదిగి దివ్యకార్యములో పాల్గొను అవగాహన పెంపొందును. దివ్య సంకల్పము ప్రాణాహుతిగా మనలోనికి ప్రవేశించినపుడు మనము దానివలన ప్రభావితులమై మనలో నిజమైన వైరాగ్యము అంకురించుట ప్రారంభమగును. ఇది వృద్ధి చెందుచూ మన దైనందిక జీవితములోని సంఘటనలు, అనుబంధములయందు వైరాగ్యభావన కలిగి మన బాధ్యతలను నెరవేర్చెదము. అంతటిలోను దివ్యత్వము మాత్రమే ప్రకటింపబడుచున్నదను భావన బలీయమై వాటిలో పాలుపంచుకొని ఆనందించెదము. మనలోని మనోవికారములైన ఈషణత్రయములగు ధనేషణ, దారేషణ, పుత్రేషణలను నెమ్మదిగా అధిగమించుచూ మనము చేయు ప్రతి కార్యము దైవాజ్ఞగా భావించి నిర్వర్తించెదము. దివ్యత్వముతో కూడిన ప్రశాంతత వృద్ధిచెందుచూ సాధకునకు అనంతునిపై కలుగు ఆకర్షణ మాటలలో చెప్పలేనిది. ప్రాణాహుతి సహాయమువలన మనలో యింతటి దివ్యమైన మార్పులు సంభవించి నిజమైన మానవునిగా

జీవించు విలువైన అవకాశము మనకు లభించుట పూర్వజన్మ సుకృతము. మనము శ్రద్ధగా సాధనచేయుటయేగాక ప్రాణాహుతి పొందుటకు లభించిన అవకాశములను వినియోగించుకొని అలసత్వము చూపక ఉన్నత చైతన్యస్థితులకు ఎదుగుటకు కృషిచేయవలెను. ఇటువంటి భాగ్యము మనతోటివారలకు కూడ కలుగవలెనని ఈ శుభదినమున సంకల్పించుకొనెదము. పూజ్య గురుదేవుల కరుణ, ఆశీస్సులు అందరకు తప్పక లభించునని మా ప్రగాఢ విశ్వాసము.

- వి.రామం